

# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళుగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# పాతాళ భైరవి-12

అక్కడ రెండు పిశాచాలు మాయచెప్పులు, మాయశాలువా కోసం తగవులాట!

టకా: ఏయ్ శకా. చెప్పులు నేను తీసుకుంటాను. శాలువా నువ్వు తీసుకోరా.

శకా: ఒరేయ్ టకా. శాలువా నువ్వు తీసుకోరా.నాకు చెప్పులే కావాలి.

టకా: నేను చచ్చినా వదల్ను.నేను నిన్ను మింగేస్తా.

శకా: నేను నిన్ను మింగేస్తా. ఒరే నేను నిన్ను మింగేసి, నువ్వు నన్ను మింగేస్తే , మనం ఇద్దరం మిగలం కదురా. అహ్హహ్హా. ఇద్దరం మిగలకపోతే మరి ఈ వస్తువులెవరికిరా? –ఇద్దరూ: అహ్హహ్హా.——వికటాట్టహాసం. (దూరంగా) మిత్రమా...ఓ మిత్రమా.

టకా: నరవాసన, నరవాసన.

శకా——వాడిని ఆపి. : మనుషులు చాల తెలివిగలోళ్ళురా. మన తగువు ఆళ్ళు తీర్చగలరురా.

టకా: తీర్చగలరంటావా?

శకా: ఓ. ఆళ్ళ తీర్పే తీర్పురా.

టకా: ఓ. ఓయ్...

అంజి: మిత్రమా...ఓ మిత్రమా.

శకా: ఓ. –

అంజి: మిత్రమా...ఓ మిత్రమా –అని అరుస్తూ పొదల్లో దారి చేసుకుంటూ వస్తాడు: ఎక్కడా? మిత్రమా ఎక్కడ? –పిశాచాలు వస్తువులు మూటకట్టి రాతిపై పెట్టి పక్కకి తప్పుకుంటారు.

అంజి: ఇక్కడంతా దిక్కుమాలిన భూతాలు. –అతడు మూటను చూసేలోగా చెరోవైపునుండీ పిశాచాలు వచ్చి పట్టుకుంటాయి. అంజికి పైప్రాణాలు పైనే పోతాయి. వణుకుతూ జపం చేసుకుంటాడు.

శకా: నీ తలబుర్రలో తెలివుంటే నిన్నేం చెయ్యమురా.

అంజి: తెలివాండీ? తలబుర్రలోనాండీ? ఉంది బుర్రలో.

శకా: చూడరా. ఇవి మాయ చెప్పులు.

అంజి——ఆశ్చర్యంగా: మాయ చెప్పులా?

టకా: నేనే సంపాదించాను.

శకా: ఏయ్. –వాడిని వారించి–– ఇవి తొడుక్కుని ఎక్కడ ఉండాలంటే చిటికెలో అక్కడుంటామురా.

టకా: ఇది మాయ శాలువా. ఇది కప్పుకుంటే ఏరికీ కనపడం!

ఇద్దరూ: ఈ రెండు వింత మాయ వస్తువుల్నీ మేమిద్దరం కలిసే సంపాదించాం. ఇద్దరం పంచుకోవాలి.

టకా: ఈ రెండింటిలో ఎవరికేది రావాలో తెలివిగా తీర్పు చెప్పు.

అంజి: ఐతే గద్దరించకుండా చెపుతారాండీ? ఐతే మీరు నిజంగా భూతాలేనాండీ?

ఇద్దరూ: ఔనురా నరుడా.

అంజి: ఐతే భూతాలకి బుద్ధిలేదన్నమాట నిజమేనన్నమాట!

టకా: ఒరే నరాధమా.

అంజి: అవధరించండి. అయ్యో. ముళ్ళు గుచ్చుకోకుండా చెప్పులు; చలిలేకుండానేమో శాలువా. ఇంతే. ఎందుకూ పనికిరావివి.

టకా: ఏయ్.నరాధమా. ఇందులో మహిమే లేదంటావురా?

అంజి: అబ్బే. లేదు. లేదు.

శకా: తొడిగి చూడరా.తెలుస్తది.

అంజి——విలక్షణంగా నవ్వుతూ, చెప్పులు తొడుక్కుని, ఇరుదెసలా పరికించి, : ఆ చెట్టు దగ్గరికి వెళ్ళాలి. ...మహిమచే వెళ్తాడు. మళ్ళీ వెనుకకు వస్తాడు.

టకా: ఐతే మరి ఏమనుకున్నావురా నరాధమా?

అంజి: ఐతే మరి శాలువ సంగతి కూడా చూడనా?

వాళ్ళు: చూడరా. —అంజి శాలువ కప్పుకుంటాడు. [ఇక్కడ ప్రేక్షకులు గమనించ వలసిన విషయం——అంజి చెప్పులు విడవలేదని!] భూతాలు మెచ్చుకుంటూవుండగా అదృశ్యమౌతాడు. — : శకా,టకా, నేను కనపడుతున్నానా? —వాళ్ళు చుట్టూ తిరుగుతూ: లేదు. లేదు. లేదురా. నేపథ్యంలో అంజి: ఐతే ఇంక తీర్పు చెపుతాను వినండి. మీ పేర్లేమిటి? —

వాళ్ళు: శక,టక.

నేపథ్యంలో అంజి: భూతకులాలంకారులారా. శకా.టకా. హాయిగా వుండండి. శకశకా,టకటకా. పిట్టపోరు పిట్టపోరు పిల్లితీర్చినట్లు! నాకుపనివుంది. నా మిత్రుని దగ్గరికి వెళ్ళాలి. టకటకా. టకటకా. తకటక టకటకా.——కంఠధ్వని ఆగిపోతుంది. నేపథ్యంలో పాత సినిమా పాట సంగీతం——భలేభలే నా బండి——పరుగుతీసే బండి... పిశాచాలు ఉక్రోషంతో పోట్లాడుకుంటాయి .★★★

మాంత్రికుని గుహలో దాహంతో నోరెండిపోయిన రాము వెనుకకు విరిచిన కట్లతో నేలపై పడివుండి: ఒరే. నీళ్ళురా. —శిష్యుడు సదాజప జపం విడిచి లేచి వచ్చి –ఎకసక్కెంగా: రాజకుమారి వద్దూ? వెధవ. ఊఁ.తాగు. నీళ్ళు కావాలీ?[ ఈ రోజుల్లో హీరోతో సహాయ నటుడు ఇలా అనగల ధైర్యం వుందా?] —పైశాచికత్వంతో నీటి ముకుడు దూరంగా లాగేస్తాడు. అంజి ప్రత్యక్షమై ఆ దృశ్యం చూస్తాడు.

—రాము శిష్యుడు సదాజపతో: నీకు అభయం ఇస్తున్నానురా.

సదాజప : ఓరి పిడుగా! నీ ప్రాణాలు నా అరచేతిలోవుంటే, నాకే అభయమిస్తావ్?

రాము: నీళ్ళివ్వరా.

సదాజప: భలేరాముడివంటే నువ్వే. మూకుడు దూరంగా పెట్టి——తాగు——వెనక్కి వెడతాడు. అంజి మాయమైవుండి మూకుడు రామునోటివద్ద ఉంచుతాడు. శిష్యుడు అదిచూసి తిరిగివచ్చి నీటి మూకుడును ఎత్తైన స్తంభం దిమ్మపై పెడ్తాడు. వెటకారంగా : ఇప్పుడు తాగు. —శిష్యుడు చూస్తుండగా మూకుడు రామువద్దకు ఎగిరి వస్తుంది. వాడు దాన్ని పట్టుకుని పరీక్షచేసి: మాయ చేస్తావ్? గాడిదా వుండు. హాం ఫట్. —కూర్చోబోగా ఆసనం వెనక్కిపోయి దభీమని నేలకూలుతాడు. అంత నికృష్ట పరిస్థితిలోను రాము నవ్వుతాడు.

శిష్యుడు ఏడుస్తూ : నవ్వుతావురా. రేపు అమ్మవారికి బలి ఇచ్చేటప్పుడు నవ్వరా ఈ నవ్వంతాను. —అంతలో ఒక పుర్రె లేచి శిష్యుడిపైకి ఉరుకుతుంది. : మోసం గురూ. —అదృశ్యంగా నవ్వుతూ అంజి గుద్దులు గుద్దుతూవుంటే అటూ ఇటూ పడుతూ లేస్తాడు. అంజి దృశ్యంగా పెద్ద ఎముకతో వాడి తలపై మోది స్పృహ తప్పిస్తాడు. అంజి రామువద్దకు వస్తాడు. "మిత్రమా" అంటూ.

రాము: వచ్చావా? —అంజి నీళ్ళు తాగిస్తాడు. రాము కట్లు విప్పుతాడు. రాములేచి ఒళ్ళు విరుచుకుంటాడు. (Direction ప్రతిభ——సహజత్వం)

రాము: అంజీ.అంజీ——కౌగిలించుకుంటాడు ఆనందంగా. :ఎట్లా వచ్చావురా?

అంజి: నేనా? ఇదిగో! (చెవిలో రహస్యం చెపుతాడు)

రాము: ఆశ్చర్యంగా——ఆఁ? ––అంజి చెప్పులు చూపిస్తాడు. రాము చెప్పులుతొడిగి, శాలువ కప్పుకుని మాయమౌతాడు.

అంజి: మిత్రమా. నువ్వు రాకుమారి వద్దకు వెళ్ళు. నేను మాంత్రికుడి భరతం పడతాను. –తెలివితప్పి పడివున్న శిష్యుడి దగ్గరికివెళ్ళి దుస్తులు తారుమారు చేసి వాడివేషం ధరిస్తాడు. { నేపథ్య సంగీతం——భలేభలే నా బండి...} ★★★

మాంత్రికుడి మందిరంలో పరిచారికల మధ్య మూర్తీభవించిన శోకదేవతలా రాజకుమారి ఇందుమతి.

(సశేషం)

COMMENTS